విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

సోమవారం 20, జనవరి 2025 8 పేజీలు

ఏనుగుల దాడిలో మారుపూరి రాకేష్ చౌదరి మృతి

విశాలాంధ్ర-చంద్రగిరి: ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు కుటుంబానికి అత్యంత సన్నిహితులు కందులవారి పల్లి (నారావారిపల్లి) ఉపసర్పంచ్, టిడిపి మండల అధ్యక్షులు మారిపూరి రాకేష్ చౌదరి ఏనుగుల దాడిలో శనివారం రాత్రి మృతి చెందాడు. చంద్రగిరి మండలం, కందులవారిపల్లి పంచాయతీ, మామిడిమానుగడ్డ గ్రామానికి చెందిన మారుపూరి రాకేష్ చౌదరి మృతదేహాన్ని ఆదివారం ఆయన స్వగ్రామం మామిడి మానుగడ్డ గ్రామంలో దహన క్రియలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ టిటిడిపి మండల అధ్యక్షులు మారుపూరి రాకేష్ చౌదరి మృతి బాధాకరమని ఆయన లేని లోటు పార్టీకి తీవ్ర నష్టమని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. సమాచారం అందిన వెంటనే సమయంతో పని లేకుండా నాని సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాకేష్ మృతదేహాన్ని చంద్రగిరి ఏరియా హాస్పిటల్ లోని మార్చురీకి తరలించారు. చంద్రగిరి ఏరియా ఆసుపత్రిలో పోస్ట్ మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పంట పొలాలలో ఏనుగులు సంచరిస్తున్నాయని సమాచారం రావడంతో మారుపూరి

3లో

అయోధ్య రాముడికి టీటీడీ చైర్మన్
పట్టు వస్త్రాలు సమర్పణ

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: టీటీడీ తరపున అయోధ్య శ్రీ రాముడికి చైర్మన్ బి.ఆర్.నాయుడు సతీ సమేతంగా ఆదివారం పట్టువస్త్రాలు సమర్పించారు. అయోధ్య ఆలయం వద్దకు చేరుకున్న టీటీడీ చైర్మన్ కు శ్రీరామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ బృందం స్వాగతం పలికారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా వెళ్ళి శ్రీరాముడికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అర్చకులు టీటీడీ బృందానికి ఆశీర్వాదం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, హెచ్ డీపీపీ సెక్రెటరీ శ్రీరామ్ రఘునాథ్, శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, ముఖ్య అర్చకులు గోపీనాథ్ దీక్షితులు, బొక్కసం ఇన్ ఛార్జ్ గురురాజ స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను అవమానపరిచిన
అమిత్ షాకు భారతదేశంలో తిరిగే అర్హత లేదు

- ప్రత్యేక హోదా ప్రకటించని అమిత్ షా గో బ్యాక్
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు డిమాండ్

విశాలాంధ్ర-తిరుపతి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను పార్లమెంటులో బాధ్యత కలిగిన హోం మంత్రి పదవిలో ఉంటూ అవమానపరిచిన అమిత్ షా భారత దేశంలో తిరిగే అర్హత లేదని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు తీవ్రంగా విమర్శించారు ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ నందు ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో అమిత్ షా ఆంధ్ర రాష్ట్రానికి రావడానికి వ్యతిరేకిస్తూ అమిత్ షా గో బ్యాక్ అంటూ నిరసన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ ప్రపంచ మేధావిగా పేరు పొంది భారత రాజ్యాంగ నిర్మాతగా అత్యంత ప్రతిష్టాత్మకంగా రాసిన రాజ్యాంగంపై అమిత్ షా ఎంపీగా ప్రమాణం చేసి హోం మంత్రిగా ఉంటూ బాధ్యతారహిత్యంతో సాక్షాత్తు పార్లమెంటులో అంబేద్కర్ను అవమానపరచడం అమిత్ షా అజ్ఞానానికి నిదర్శనం అన్నారు అంబేద్కర్ అంబేద్కర్ అంబేద్కర్ అని అనే బదులు దేవుడా దేవుడా అంటే స్వర్గ ప్రాప్తి పొందవచ్చని హేళనగా మాట్లాడిన అమిత్ షా హోం మంత్రి పదవిని వదిలిపెట్టి స్వర్గానికి ఎందుకు పోలేదని ఎద్దేవా చేశారు. మహా కుంభమేళాలో ఒంటి మీద బట్టలు లేకుండా తిరుగుతున్న అఘోరాలు లాగా అమిత్ షా కూడా తిరిగి స్వర్గ ప్రాప్తి పొందచ్చని సూచించారు భారత రాజ్యాంగానికి కట్టుబడి పని చేయాల్సిన పాలకులు ప్రధానంగా బిజెపి ప్రభుత్వం మనువాద సిద్ధాంతాన్ని తీసుకురావాలని కుట్రలో భాగంగానే భారత రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ అంబేద్కర్ని హేళన చేస్తూ మాట్లాడుతున్నారన్న విషయాన్ని ప్రజలు గమనించాలని అన్నారు. బిజెపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి 15 సంవత్సరాలు పాటు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పిన మాటను నేడు ఎందుకు మోదీ అమిత్ షా లు విస్మరించారో ఆంధ్ర ప్రదేశ్ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా రాష్ట్రంలో అడుగుపెట్టే అర్హత అమిత్ షాక్ లేదని వారు తీవ్రంగా మండిపడ్డారు అందుకోసమే ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ను మేల్కొల్పేందుకే వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అమిత్ షా గో బ్యాక్ అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

2లో

ప్రజాకవి యోగి వేమన: కలెక్టర్ సుమిత్ కుమార్

యోగి వేమనకు ఘన నివాళి

విశాలాంధ్ర-చిత్తూరు: పామరులకు కూడా అర్థమయ్యే భాషలో పద్యాలు చెప్పిన ప్రజాకవి వేమన అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జిల్లా సచివాలయం లోని పాత గ్రీవెన్స్ హాల్ నందు ప్రజా కవి యోగి వేమన జయంతిని జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తో పాటు జెడ్పి చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, చిత్తూరు ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్ పాల్గొని యోగి వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేమన పద్యాలు తెలుగు వారికి సుపరిచితమని, ఆటవెలదిలో సరళమైన రీతిలో హృదయాలకు హత్తుకునే విధంగా పద్య రచన చేశారన్నారు. యోగి వేమన జయంతిని ప్రతి సంవత్సరం జనవరి 19న రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సమాజ చైతన్యానికి అవసరమైన సలహాలు, సూచనలు, విలువలతో కూడిన రచనలు చేసే వారన్నారు. ప్రతి పద్యానికి విశ్వదాభిరామ వినుర వేమ అనే మకుటంచేర్చారన్నారు. మానవుని హీనస్థితికి కారణమైన వ్యవస్థ లపై తిరుగుబాటు చేశారన్నారు. వేమన రచనల లోని భావాలను బట్టి గొప్ప మానవతావాదిగా చూడవచ్చన్నారు. వేమన పద్యాలను ఆంగ్ల, ఐరోపా భాషలన్నింటిలోనూ అన్ని ద్రవిడ భాషల్లోనూ అనువదించారన్నారు. ఐక్యరాజ్య సమితి యునెస్కో విభాగం వారు ప్రపంచ బాషా కవుల్లో ఒకరిగా యోగి వేమన ను గుర్తించారన్నారు. ఇది తెలుగు వారికి దక్కిన గొప్ప గౌరవం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రబ్బానీ భాష, పిఆర్ఎస్ఈ చంద్ర శేఖర్ రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నెత్తురోడిన రహదారి

- జక్కలవారిపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- లారీని వేగంగా ఢీకొట్టిన కారు
- ఇద్దరు చిన్నారులు, ఒక మహిళ దుర్మరణం

వార్త మెయిన్‌లో

బీవీ పాలెం బోటు షికారులో
ఉత్సాహంగా ఉల్లాసంగా..

- ఫ్లెమింగో పక్షులను సందర్శించి ప్రకృతిని ఆస్వాదిస్తున్న విద్యార్థులు, పర్యాటకులు, ప్రజలు
- ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేస్తున్న పలువురు పర్యాటకులు
- విద్యార్థులతో కలిసి బోటులో ప్రయాణించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మరియు ఎంఎల్ఏ నెలవల విజయ శ్రీ

విశాలాంధ్ర-తడ: ఈ నెల 18న శనివారం ఫ్లెమింగో ఫెస్టివల్ 2025ను సూళ్లూరుపేట నియోజక వర్గం లోని సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల

2లో

అంగరంగ వైభవంగా

ఫ్లెమింగో ఫెస్టివల్ వేడుకలు

- జనసంద్రమైన సూళ్లూరుపేట

- సినీ ప్రముఖుల రాకతో జాతరను తలపించిన సూళ్లూరుపేట పురవీధులు

విశాలాంధ్ర-సూళ్లూరు పేట: ఫ్లెమింగో ఫెస్టివల్ 2025ను సూళ్లూరుపేట పట్టణంలోని జూనియర్ కళాశాల ప్రాంగణంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో సినీ ప్రముఖుల రాకతో సూళ్లూరుపేట కళాశాల మైదానం జన సముద్రాన్ని తలపిస్తోంది. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, సులూరుపేట శాసనసభ్యులు నిలవల విజయశ్రీ ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్ రెండవ రోజైన ఆదివారం ఎటు చూసినా జన ప్రభంజనంతో క్రిక్కిరిసి పోయింది. కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు శాఖల స్టాళ్లు చూపరులను కనువిందు చేస్తోంది. విద్యుత్ కాంతులతో క్రిక్కిరిసిన జనం కేరింతలతో కళాశాల ప్రాంగణం హోరెత్తింది. ఆదివారం సాయంత్రం పలువురు మిమిక్రీ కళాకారులు సినీ తారలు పాల్గొనడంతో ప్రజలు పర్యాటకులు విద్యార్థులు తల్లితండ్రులను ఆకట్టుకునే విధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలను తిలకించేందుకు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆనంద్ గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దెబ్బల శ్రీమంత్ రెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

అమిత్‌షాకు భారతదేశంలో తిరిగే అర్హత లేదు

(మొదటి పేజీ తరువాయి) కే.రాధాకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి కే.శివారెడ్డి ఏఐటియుసి నగర కార్యదర్శి ఎండి రవి, కే.పద్మనాభరెడ్డి, ఎన్ శివ, ఎం.రామకృష్ణ, చిన్నం కాళయ్య, జె.నాగరాజు, కేవైరాజా అల్లా బక్షు ప్రమీల సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుబ్రహ్మణ్యం నగర కార్యదర్శి వేణు, బుజ్జి, రైతు సంఘం నాయకురాలు హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉల్లాసంగా..

(మొదటి పేజీ తరువాయి) ప్రాంగణంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి వర్యులు ప్రారంభం చేయడం జరిగిందని, సదరు ఫ్లెమింగో ఫెస్టివల్ కార్యక్రమాలలో భాగంగా అటకాని తిప్ప పులికాట్ రక్షిత కేంద్రం నందు ఫ్లెమింగో పక్షుల వీక్షణ ఏర్పాటు, నేలపట్టు పక్షుల అభయారణ్యం నందు పెలికాన్ పక్షుల వీక్షణ ఏర్పాటు, బీవీ పాలెం నందు బోటింగ్, శ్రీ సిటీ నందు పలు మేధావులతో పర్యాటక అభివృద్ధి, పరిశ్రమల అభివృద్ధి పర్యావరణ హిత అంశాలు, పులికాట్ సంరక్షణ తదితర అంశాలపై కాంక్లేవ్ ఏర్పాటు, సూళ్లూరుపేట జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఫ్లెమింగో ఫెస్టివల్ కార్యక్రమాల ప్రారంభ, ముగింపు కార్యక్రమాలు, పలు శాఖల స్టాల్స్ ఏర్పాటు, పలు స్థానిక తదితర సాంస్కృతిక కార్యక్రమాలు, పలు స్థానిక క్రీడలు ఘనంగా నిర్వహించుట కొరకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టడం జరిగిందని, ప్రతి ఒక్కరూ ఫ్లెమింగో ఫెస్టివల్ 2025 సందర్శన చేసి ఫ్లెమింగో, పెలికాన్ వంటి పలు అరుదైన పక్షులను వీక్షించి ప్రకృతిని ఆస్వాదించండి అని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ మరియు సూళ్లూరుపేట శాసనసభ్యులు నెలవల విజయశ్రీ సంయుక్తంగా పేర్కొన్నారు.

ఆదివారం ఉదయం రెండో రోజు ఫ్లెమింగో ఫెస్టివల్ – 2025 సందర్భంగా బీవీ పాలెం వద్ద ఏర్పాటు చేసిన బోట్ లో ఉత్సాహంగా ఉల్లాసంగా షికారు చేస్తూ ప్రకృతిని ఆస్వాదిస్తున్న యువత, విద్యార్థిని, విద్యార్థులు పలువురు పర్యాటకులు, ప్రజలు. విద్యార్థినీ విద్యార్థులతో కలిసి కలెక్టర్ మరియు ఎంఎల్ఏ బోటులో ప్రయాణించి ఏర్పాట్లపైనా, పలు అంశాలపై వారి ప్రతిస్పందనను అడిగి తెలుసుకున్నారు. ఈ ఫ్లెమింగో ఫెస్టివల్ వారి ప్రాంతంలో జరగడం పట్ల నియోజక వర్గ ప్రజలు చాలా అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. పలువురు పర్యాటకులు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు వారి అభిప్రాయాలు తెలుపుతూ ఇంత అద్భుతంగా ఈ ఫ్లెమింగో ఫెస్టివల్ ను ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని ప్రజలు హర్షాన్ని ఈ సందర్భంగా వ్యక్తపరుస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులకు చంద్రబాబు నాయుడు గారికి, టూరిజం శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ గారికి , స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ గారికి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ వివరిస్తూ ప్రతి ఒక్కరికి లైఫ్ జాకెట్ ఏర్పాటుతో, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసి, అన్ని రకాల భద్రతా చర్యల నడుమ బోటు షికారు ఏర్పాట్లను చేసి అరుదైన ఫ్లెమింగో పక్షులను వీక్షించేందుకు వచ్చే ప్రజలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించామని తెలిపారు. జిల్లా యంత్రాంగానికి పలువురు మనసారా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సందర్శకుల కోసం మెడికల్ క్యాంప్ ఉచిత తాగు నీటి సరఫరా చేశారని, స్టాల్స్ చాలా బాగా పర్యాటకుల్ని ఆకట్టుకుంటున్నాయని, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు బాగా ఉన్నాయని వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు, జిల్లా సాంఘిక సంక్షేమ మరియు సాధికార అధికారి చెన్నయ్య, ఫైర్ సిబ్బంది,స్థానిక తాసిల్దార్ శరత్ బాబు ఎంపీడీవో విజయ్ కుమార్, స్థానిక నాయకులు బొమ్మన శ్రీధర్ పూడి సెల్వం సుధాకర్ జయపాల్,రవి అధికారులు ఉన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

- గూడూరు వెటర్నరీ ఏడిఏ సురేష్.

విశాలాంధ్ర-గూడూరు: ఈనెల 20 నుండి 31 వరకు గూడూరు డివిజన్ పరిధిలో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు వెటర్నరీ ఏ.డి. ఏ సురేష్ పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశువుల ఆరోగ్య రక్షణకు పశు ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. వైద్యుల సహాయంతో పశువులను పరీక్షించి ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. పశు పోషకులు ఈ ఆరోగ్య శిబిరాలను సద్విని చేసుకోవాలని పేర్కొన్నారు.

అక్రమ సంబంధమే హత్యకు కారణం

విశాలాంధ్ర-పలమనేరు: అక్రమ సంబంధమే శివకుమార్ హత్యకు కారణమని పలమనేర్ డి.ఎస్.పి డేగల ప్రభాకర్ పేర్కొన్నారు. అందులో భాగంగా ఆదివారం మీడియా సమావేశంలో హత్యకు కారకుడైన షమీరును బంగారుపాలెం మండలం మొగిలి పై ఓవర్ వద్ద పట్టుకొని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలు మేరకు సుమారు 6 నెలల క్రితం శివకుమార్ భార్య ఉషారాణి కూలి పని నిమిత్తం షామీర్ నిర్వహిస్తున్న హెూటల్, చికెన్ సెంటర్లో పని కుదుర్చుకుందని తెలిపారు. క్రమేణ ఇద్దరి మధ్య సన్నిహిత భావం కలిగి ప్రేమగా మారిందని విచారణలో తేలిందన్నారు. ఇద్దరి మధ్య ఉన్న ప్రేమ వ్యవహారం శివకుమార్ కు తెలియడంతో భార్య ఉషారాణిని అదుపులో ఉంచుకోవడానికి ప్రయత్నించాడని తెలిపారు. శివకుమార్ మాటలను భార్య పెడచెవిని పెట్టి డిసెంబర్ 2024 లో పది రోజులు పాటు ఉషారాణి, నిందితుడు సమీర్ ఇద్దరూ కలిసి బయట ప్రాంతానికి వెళ్లిపోయినట్లు విచారణలో తేలిందన్నారు. ఉషారాణి తనకు ఇద్దరు పిల్లలు వారి భవిష్యత్తు నాశనం అవుతుందని భావించి షమీరుకు నచ్చజెప్పి తిరిగి సొంత గ్రామానికి వచ్చేసిందని వివరించారు. ఈ హత్య కేసులో ఇంకెవరి ప్రమేయం ఉందా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు డి.ఎస్.పి స్పందిస్తూ ఇప్పటివరకు టెక్నికల్ సమాచారం మేరకు బయటపడలేదన్నారు. మృతిని బట్టల పైన రక్తపు మరకలు ఉన్నాయని వాటిని ల్యాబ్ కు పంపుతామని, అదేవిధంగా నిందితుడు ఫోన్లో ఉన్న నెంబర్ల ద్వారా మరికొన్ని వివరాలను సేకరించడం జరుగుతుందన్నారు. ఈ హత్యలో భార్య ఉషారాణి ప్రమేయం ఉందా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు డిఎస్పి స్పందిస్తూ ఆమె ప్రమేయం ఉన్నట్లు విచారణలో తేలలేదన్నారు. ఈ మీడియా సమావేశంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహారాజు, ఎస్సై స్వర్ణ తేజ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిపోయిన పాపను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

విశాలాంధ్ర-తిరుపతి: ఫ్లెమింగో ఫెస్టివల్ 2025ను సూళ్లూరుపేట పట్టణంలోని జూనియర్ కళాశాల ప్రాంగణం లో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో వీక్షించడానికి సందర్శకులు తండోప తండాలుగా విచ్చేసిన సందర్భంలో ఒక కుటుంబం లోని పాప తప్పిపోగా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలీస్ వారి హెల్ప్ లైన్ స్టాల్ నందు ఫిర్యాదు చేయగా పోలీస్ వారు వెంటనే స్పందించి అబ్బాయి జాడను తెలుసుకొని వారి కుటుంబీకులకు అప్పగించిన పోలీస్ శాఖ అధికారులు. సీసీ కెమెరాల ఏర్పాటుతో, పక్కా భద్రత ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగానికి, పోలీస్ అధికారులు, సిబ్బందికి వారు మనసారా కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కార్పొరేషన్ ఆఫీసులో 'పిజిఆర్ఎస్'

విశాలాంధ్ర-తిరుపతి కార్పొరేషన్: తిరుపతి నగరపాలక కార్యాలయంలో సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎన్ మౌర్య ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే ముందుగా డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి 10:30 గంటల మధ్య ఫోన్ ఇన్ కార్యక్రమం ముగిశాక అప్పటి నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నగరవాసుల వద్ద నుంచి వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఫోన్ ఇన్ కార్యక్రమానికి 0877-2227208 నెంబర్కు సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్జీలతోపాటు తప్పనిసరిగా ఆధార్, ఫోన్ నెంబర్ పొందుపరచాలని సూచించారు. కార్యక్రమానికి అధికారులు విధిగా హాజరు కావాలని ఆదేశించారు.

రాకేష్ చౌదరి మృతి

(మొదటి పేజీ తరువాయి) రాకేష్ చౌదరి వాటిని తరిమేందుకు మరొకరితో కలిసి పొలాల వద్దకు చేరుకున్నారు. ఏనుగులను తరిమే ప్రయత్నంలో ఏనుగులు వీరిపై దాడి చేయడంతో ఒకరు చెట్టు పైకి ఎక్కగా రాకేష్ పరుగులు తీయగా తెల్ల చొక్కా వేసుకోవడంతో అతనిని వెంబడించి దాడి చేశాయి. ఏనుగుల దాడిలో అక్కడికక్కడే రాకేష్ చౌదరి మృతి చెందాడు. ఏనుగుల దాడిలో మృతి చెందినట్లు స్థానికులు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి సమాచారం అందించారు. ఎమ్మెల్యే అధికారులను, కార్యకర్తలను అప్రమత్తం చేశారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు అధికారులను, నాయకులను అడిగి తెలుసుకున్నారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అధికారులను, కార్యకర్తలను, గ్రామస్తులను, కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు నేనున్నానని ధైర్యం చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం రాకేష్ మృతదేహాన్ని చంద్రగిరి ఏరియా హాస్పిటల్ కు తరలించారు. రాకేష్ కుటుంబ సభ్యులు చంద్రగిరి పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇచ్చారు. కుటుంబ సభ్యులతో పాటు పులివర్తి నాని ఉన్నారు.

విశాఖ ఉక్కు కర్మాగారానికి ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయం

విశాలాంధ్ర-తిరుపతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనశక్తి విద్యుత్ ఎంప్లాయాస్ యూనియన్ విశాఖ ఉక్కు కర్మాగారానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడి ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయం. వైజాగ్ స్టీల్ ప్లాంట్కు రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనశక్తి విద్యుత్ ఎంప్లాయాస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అళహరి సుధాకర్, రాష్ట్ర అధ్యక్షులు తోకల అశోక్ కుమార్ తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర జనశక్తి విద్యుత్ ఎంప్లాయాస్ యూనియన్ అధ్యక్షులు తోకల అశోక్ కుమార్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగార కార్మిక, ఉద్యోగుల పోరాటం ఫలించిందని కార్మిక, ఉద్యోగుల శ్రేయస్సు కొరకు నిరంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు కె.పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని ఆయన తెలియజేశారు. ఈ రోజు వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపదలలో కీలకమైన ముఖ్య పాత్ర నిర్వహించి కేంద్రం నుంచి ప్యాకేజీ ఇప్పించిన జనసేన పార్టీ అధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనశక్తి విద్యుత్ ఎంప్లాయాస్ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆయన తెలియజేశారు. కార్మిక, ఉద్యోగ శ్రేయస్సు కొరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనశక్తి విద్యుత్ ఎంప్లాయాస్ యూనియన్ పాటుపడుతుందని గౌరవ అధ్యక్షులు అళహరి సుధాకర్ తెలియజేశారు. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రివర్యులు హెచ్.డీ.కుమార స్వామికి, కేంద్ర భారీ, ఉక్కు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకి, కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహనాయుడుకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనశక్తి విద్యుత్ ఎంప్లాయాస్ యూనియన్ తరపున అభినందనలు తెలియజేశారు.

జాతీయ స్థాయి గిరిజన సాంస్కృతిక మహెూత్సవంను జయప్రదం చేయండి

ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్)

విశాలాంధ్ర-తిరుపతి: ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో జాతీయ స్థాయి గిరిజన సాంస్కృతిక మహెూత్సవముల గోడపత్రిక పోస్టర్స్ ఆదివారం శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ మెయిన్ గేట్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించడం జరిగింది ఈ సందర్భంగా ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కరంసి అక్కులప్ప నాయక్, మాట్లాడుతూ ఫిబ్రవరి 5 6 తేదీల్లో జాతీయస్థాయి గిరిజన సంస్కృతి ఉత్సవాలు ఆదికవి నన్నే విశ్వవిద్యాల యం రాజమహేంద్ర వరంలో జరుగును భారతీయ సంస్కృతి లో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఒక భాగంగా ఉన్నాయని వాటిని పరిరక్షించే బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాలని అన్నారు. గిరిజన చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునేందుకు జాతీయ స్థాయిలో గిరిజన సాంస్కృతిక మహెూత్సవంను నాలుగు రాష్ట్రాల నుంచి గిరిజన కళాకారులు ఆదివాసులు తెలంగాణ కర్ణాటక చత్తీస్గఢ్ ఒరిస్సా రాష్ట్రాల నుంచి వివిధ కళాకారులు ఆదివాసి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ టీఎస్ఎఫ్ నాయకులు డాక్టర్ మహేందర్ నాయక్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ చిరంజీవి మల్లేష్ నాయక్ జగన్ నాయక్ నాగేంద్ర నాయక్ వి శంకర్ నాయక్ ప్రసాద్ లోకో నాయక్ లింగా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు రూరల్ మండలంలోని ఉత్తరపు కండ్రిగ సమీపంలో వున్న తిరుపతి-చెన్నై జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం 3, 4 గంటల మధ్యలో నగరి నుంచి పుత్తూరు వైపుగా కాలినడకన నడిచి వెళ్లే ప్రకాష్ (46) అనే వ్యక్తిని వెనక వైపు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి నుజ్జునుజ్జు అయ్యి మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం పోలీసు అధికారులు మాట్లాడుతూ నగరి నుంచి పుత్తూరు వైపు నడిచి వెళుతుండగా అదే వైపుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో గేట్ పుత్తూరు గణపతి నగర్ కు చెందిన ప్రకాష్ అనే వ్యక్తి మృతి చెందినట్లు తెలిసిందన్నారు. ఆ వ్యక్తి ఎరుపు గళ్ళ చొక్కా నలుపు గళ్ళ లుంగి, పుమేక్స్ డ్రాయర్ తో ఉన్నాడని పుత్తూరు పోలీసులు తెలిపారు. ఇదే విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తూ వున్నామన్నారు. అలాగే శవ పరీక్ష నిమిత్తం మృత దేహాన్ని పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు.

విద్యార్థులకు సైకిళ్లను అందించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గుడిపాల: గుడిపాల మండలంలోని నరహరి పేట ఉన్నత పాఠశాలలో ఈ ఆదివారం ఎమ్మెల్యే తన జన్మదిన సందర్భంగా పేద విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా 20 సైకిళ్లను అందజేశారు. అనంతరం ఉన్నత పాఠశాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మరియు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్. పాఠశాలలోని మరమ్మత్తులు మరియు విద్యార్థిని విద్యార్థులకు టాయిలెట్ల సౌకర్యాలను ఏర్పాటు చేయాలని మండల అధ్యక్షుడు చలిచుమల సుబ్రహ్మణ్యం నాయుడు కలెక్టర్ సుమిత్ కుమార్ ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ శాసనసభ్యులు ఆర్ గాంధీ, బాలాజీ నాయుడు, మండల అధ్యక్షుడు చలి చీమల సుబ్రహ్మణ్యం నాయుడు, మండల ఉపాధ్యక్షుడు దేవపత్ని అనిల్ చౌదరి, గొల్ల హరి చౌదరి, విద్యార్థిని విద్యార్థులు, తెదేపా పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ల అప్పీల్ కార్యక్రమం 22వ తేదీకి వాయిదా

విశాలాంధ్ర -చిత్తూరు : జిల్లా కేంద్రమైన చిత్తూర్ నగరంలో ఈ నెల 20వ తేదీన కానిస్టేబుల్ అభ్యర్థులకు జరగవలసిన అప్పీల్ కార్యక్రమాన్ని ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసినట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు,ఒక ప్రకటనలో తెలిపారు.చిత్తూరు జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్ పెరేడ్ గ్రౌండ్ నందు చిత్తూరు ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు జరుగుతున్న కానిస్టేబుళ్ల దేహదారుఢ్య శారీరక పరీక్షలు శనివారంతో ముగియగా, అప్పీల్ చేయదలచిన అభ్యర్థులు 20వ తేదీన రావాల్సి ఉండగా చిత్తూరు జిల్లా నందు అకాల వర్షాల కారణంగా ఈ నెల 22వ తేదీనకు వాయిదా వేసినట్టు జిల్లా ఎస్పీ పేర్కొన్నారు .కావున అప్పీల్ చేయదలచిన అభ్యర్థులు ఇది గమనించి ఈ నెల 22వ తేదీన పోలీస్ ట్రైనింగ్ సెంటర్ కు రావాలని, పోలీసు వారికి సహకరించాలని సూచించారు. భర్తీ ప్రక్రియ పారదర్శకముగా పూర్తిగా అభ్యర్థుల ప్రతిభ పాటవాల ఆధారంగానే జరుగుతుందని, కావున అభ్యర్థులు వారి తల్లితండ్రులు దళారులను మధ్యవర్తులను నమ్మకుండా, మోసపోకుండా ఉండవలెనని, ఎవరైనా మేము భర్తీకి సహకరిస్తాము అని నమ్మబలికిన డయల్ 112 కు గాని చిత్తూరు పోలీసు నెం. 9440900005 కు గాని ఫోన్ చేసి ఫిర్యాదు చేయవలెనని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులలో క్రీడా చైతన్యమే లక్ష్యం

విశాలాంధ్ర–గంగవరం: విద్యార్థులు, యువతలో క్రీడల పట్ల అనురక్తి కల్పించ డంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ క్రీడా మంత్రిత్వ శాఖ ద్వారా చిత్తూరు నెహ్రూ యువ కేంద్రం మరియు గంగవరం సంజీవని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా గంగవరం జెడ్పీ హైస్కూల్ నందు ఆదివారం క్రీడా పోటీలు నిర్వహించారు. వాలీబాల్ విభాగం నందు గంగవరం వినాయక టీం మొదటి బహుమతి, శివాడి వివేకానంద టీం రెండవ బహుమతి, బ్యాడ్మింటన్ విభాగం నందు టి.కిరణ్ కుమార్ మొదటి బహుమతి, ఎన్.నవీన్ బాబు రెండవ బహుమతి గెలుపొందారు. విజేతలకు మరియు పాల్గొన్న క్రీడాకారులకు జిల్లా నెహ్రూ యువ కేంద్ర మరియు సంజీవని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేసారు. ఇక్కడ గెలుపొందిన వారిని ఈ నెలాఖరులో జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసి పంపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా చిత్తూర్ డిస్ట్రిక్ యూత్ కోఆర్డినేటర్, సంజీవిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మరియు స్వాభిలంబిన భారత్ అభియాన్ డిస్ట్రిక్ కన్వీనర్, యు ఎస్.ఉమా మహేష్, శ్రీపురం సీతారామయ్య జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రూపాదేవి, ఉపాధ్యాయులు మల్లిచెట్ల దేవేంద్ర, జిల్లా గ్రామ వార్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాల సమగ్ర ప్రగతి సర్వేలో

చిత్తూరుకు రెండో స్థానం దక్కడం అభినందనీయం

విశాలాంధ్ర -చిత్తూరు : జిల్లాల సమగ్ర ప్రగతి సర్వేలో రాష్ట్రస్థాయిలో చిత్తూరు జిల్లాకు రెండో స్థానం దక్కడం శుభపరిణామని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేశ సురేంద్ర కుమార్ ఇతర టిడిపి నేతలు తెలిపారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాల సమగ్ర ప్రగతి సర్వే లో చిత్తూరు జిల్లా టాప్ 2 లో యుండటం అభినందనీయమని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు నాయుడు సీఎం గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి. రాష్ట్రంలో సుపరిపాలన ప్రారంభం అయిందన్నారు. ఇటీవల సీఎం జిల్లాల వారీగా సమగ్ర ప్రగతి , మంత్రులు, ఎంపీలు, యమ్మెల్యే లు , య మ్మెల్సీ ల పని తీరు మీద సమగ్ర సర్వే చేయించారు . అందులో రాష్ట్ర స్థాయిలో మన చిత్తూరు జిల్లాకు టాప్ 2 స్థానం రావడం గొప్ప విషయమని చెప్పారు. జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీనివాస్ రెడ్డి, .చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గళ్ళ ప్రసాదరావు జిల్లా పార్లమెంట్ పరిధి లోని శాసన మండలి సభ్యుడు , శాసన సభ సభ్యులకు జిల్లా కలెక్టర్లకు హృదయ పూర్వక అభినందనలు తెలియజేశారు. చిత్తూరు ఎంపీ ప్రసాద్ రావు గతం లో ఎప్పుడూ ఏ ఎంపీ చేయని విధంగా మొదటి 6 నెలల కాలంలోనే 5 కోట్లు ఎంపీ ల్యాండ్స్ కింద నిధులు విడుదల చేయించి గ్రామాలు , పట్టణాలలో సిమెంట్ రోడ్లు , డ్రైనేజీ పనులు ప్రారంభింప చేసారు. జిల్లాలో మాంగో బోర్డు ఏర్పాటుకు , కేంద్రీయ విద్యాలయం స్థాపనకు చర్యలు చేపట్టారు .టీడీపీ యమ్మెల్యే లు అందరు వారి వారి నియోజకవర్గాలలో ప్రజలకు అందుబాటులో యుంటూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలుకు , ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిత్యం కృషి చేస్తున్నారన్నారు.ముందు ముందుకూడా ఇదే స్ఫూర్తితో ముందుకు వెళుతూ జిల్లా , పార్లమెంట్ సమగ్ర అభివృద్ధి కోసం పనిచేస్తారనే నమ్మకం ప్రజలలో ఏర్పడిందని చెప్పారు.ఈ విలేఖరుల సమావేశం లో పార్టీ నాయకులు మోహన్ రాజ్ , గోపాల్ లు పాల్గొన్నారు .

అమిత్ షా గో బ్యాక్ గో బ్యాక్

వామపక్ష పార్టీల బీఎస్పీ పార్టీ నిరసన

విశాలాంధ్ర–పుత్తూరు : రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను పార్లమెంటులో అవమానపరిచిన అమిత్ షా రాష్ట్ర పర్యటన లో భాగంగా వస్తున్న సందర్భంగా అమిత్ షా గో బ్యాక్ కార్యక్రమం పుత్తూరు అంబేద్కర్ సర్కిల్ నందు నిరసన తెలిపారు ఈ సందర్భంగా సిపిఐ పార్టీ పుత్తూరు పట్టణ కార్యదర్శి డి మహేష్ ,సిపిఎం పార్టీ శాఖ కార్యదర్శి భాస్కర్ బీఎస్పీ పార్టీ సత్యవేడు ఇంచార్జ్ ధనుంజయులు మాట్లాడుతూ పార్లమెంట్లో అమిత్ షా అంబేద్కర్ అవమానించారని మేము ఎన్నిసార్లైనా అంబేద్కర్ అని అంటే జ్ఞానం పెరుగుతుందని అన్నారు అమిత్ షా అజ్ఞానంతో మాట్లాడాలని పెద్ద వచ్చేశారు ఏపీకి ప్రత్యేక హోదా కల్పిస్తామని చెప్పి 15 సంవత్సరాలు మాట తప్పారని ఏపీ సంచామన్ని గాలికి వదిలేసారని అంబేద్కర్ జయంతి రోజు మాలేయడం అంబేద్కర్ పేరు చెప్పి ఓట్లు తప్ప అంబేద్కర్ రాజ్యాంగాన్ని ఏపీ ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తున్నారు అని అన్నారు అంబేద్కర్ను అవమానపరిస్తే ఏ రాజకీయ పార్టీ కూడా నోరు మెదపడం లేదని వాళ్ల స్వాగతం పలుకుతున్నారని అన్నారు హోంమంత్రి నుంచి హంస రాజీనామా చేయాలని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ముకుంద, చంద్రబాబు, దినేష్ ,బాబు, సిపిఎం నాయకులు విజయ్, సుబ్రహ్మణ్య పిల్లై, రమేష్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ నూతన అధ్యక్షురాలిగా రమ్య

విశాలాంధ్ర–పలమనేరు : ఎన్నో సంవత్సరాల నుండి, వాసవి వనిత క్లబ్ చే, వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్నది. అందులో భాగంగా ఆదివారం ఆర్యవైశ్య మండలి అధ్యక్షుడు ఆర్ వి సుభాష్ చంద్రబోస్ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలుగా భాగీరథి రమ్య హరీష్ను ఎన్నుకోవడం జరిగింది. శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రామకృష్ణ, జిల్లా గవర్నర్ యశస్వి గుప్తా చేతుల మీదుగా....రమ్య హరీష్ ను వాసవి వనిత క్లబ్ ప్రెసిడెంట్గా నియమించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రమ్య రమేష్, ఉషా ప్రకాష్, దీప్తి బాలాజీ, కవిత కుమార్, విజయ ప్రసాద్, లక్ష్మీ రాజు ఆర్ మాధవి గారు మరియు వాసవి వనిత క్లబ్ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

పలమనేరు క్రికెటర్ అసోసియేషన్ ఎన్నికలు

విశాలాంధ్ర– పలమనేరు : పలమనేరు క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా రంజిత్ షా, సుబ్రమణ్యం లు ఎంపిక య్యారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసి సమావేశం లో పలమనేరు క్రికెటరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలమనేరు క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.పలమనేరు క్రికెట్ అసోసియేషం అధ్యక్షుడుగా రంజిత్ షా, ఉపాధ్యక్షులుగా ఆర్ ఎన్ హరికృష్ణ, నూతన సాయి ప్రతాప్, మన్సూర్, కిషోర్, ప్రధాన కార్యదర్శిగా పి. సుబ్రహ్మణ్యం, ట్రెజరర్గా గిరిబాబు, జాయింట్ సెక్రటరీలుగాలి : ధీరజ్ క్రాంతి, కే సురేష్, బ్రహ్మ కుమార్, శ్రీనివాసులు, గణపతి, ఫయాజ్ ,ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సుదర్శన్ కుమార్, హేమంత్, జాకీర్, బాలాజీ అసోసియేషన్ మెంబర్లుగా బాలాజీ, షహెన్షా, అజయ్ కుమార్ లు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్ షా, సుబ్రమణ్యం మాట్లాడుతూ... రానున్న రోజులలో పలమనేరు లో క్రికెట్ లో మంచి గుర్తింపు వచ్చేలాగా అందరి సహకారం తో కృషి చేస్తామని తెలియజేసారు

స్వచ్ఛంద సేవా సంస్థల

సేవలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర– కార్వేటినగరం: స్వయం కృషి జనహిత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలను విశ్రాంతి ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి(డైట్ అధ్యాపకులు) చెంగల్రాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ విశ్రాంతి ఉద్యోగుల సంఘం భవనంలో సత్యవేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం భారతి ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వీస్ పెన్షనర్లు, ఫ్యామిలి పెన్షనర్లకు ఉచితంగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం కృషి జనహిత స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రతి ఏడాది పెన్షనర్లు సమర్పించే లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించడంలో మా సంస్థ ప్రతి ఏడాది ఉచిత సేవలు అందిస్తోందన్నారు. అదే విధంగా అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వారిని విధిగా గుర్తించి వారికి కూడా ఇంటి వద్దకు వెళ్లి సేవలు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం విశ్రాంతి హెచ్ఎం విజయ కుమార్ పిళ్లై మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం ఇంటికే పరిమితమైన విశ్రాంతి ఉద్యోగులు నగరి, పుత్తూరులోని ట్రెజరీలకు వెళ్లకుండా ఒక్కచోటే లైఫ్ సర్టిఫికెట్లు అందిస్తున్న స్వయం కృషి జనహిత స్వచ్ఛంద సంస్థ వారి సేవలు ఎనలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగుల మండల అధ్యక్షుడు మోహన్రెడ్డి. ప్రధాన కార్యదర్శి బెంగమ్మ సుకుమారారాజు ఉపాధ్యావాణి సంపాదకులు రాజులు వాచేశ్వరరాజు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి వేడుకలు

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్లో యోగి వేమన జయంతి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ జనార్ధన్ రెడ్డి, రోహిణి మాట్లాడుతూ యోగివేమన ప్రజాకవి, సంఘసంస్కర్త,తత్వవేత్తని, ఆయన రాసిన పద్యాలు అందరికీ అర్థమయ్యే విధంగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు శ్రీకిరెడ్డి మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పేట వెంకటకృష్ణారెడ్డి, డాక్టర్ జనార్ధన్ రెడ్డి , డాక్టర్ రోహిణి , దశరథ రామిరెడ్డి , సనత్ కుమార్ రెడ్డి, రవీందర్ రెడ్డి, మండి శ్రీనివాసరెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి,రాఘవ రెడ్డి,. ప్రభాకర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి,వాసిరెడ్డి హరికృష్ణ రెడ్డి, మూలి హరనాద్ రెడ్డి,పల్లమాల హరనాద్ రెడ్డి, రాధా కృష్ణా రెడ్డి,కిషోర్ రెడ్డి, యరమాక. కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారి నియమాలు పాటించాలి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: రహదారి నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలని తిరుపతి జిల్లా రవాణాధికారి మురళీమోహన్, శ్రీకాళహస్తి మోటారు తనిఖీ అధికారి దామోదర్ నాయుడు చెప్పారు. రహదారి మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం ఏర్పేడు సమీపంలోని టోల్ గేటు వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మురళీమోహన్, దామోదర్ నాయుడు మాట్లాడుతూ...ఆటోల్లో ప్రయాణీకులను పరిమితికి మించి తీసుకెళ్లరాదన్నారు. వాహనానికి సంబంధించి అన్ని రికార్డులు కలిగి ఉండాలన్నారు. ఆటోలకు సంబంధించిన వాహన పర్మిట్, ఆర్ .సి, ఎఫ్.సీ, ఇన్సూరెన్స్, వాహనం నడిపే వారికి సరియైన డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. రేణిగుంట నుంచి నాయుడుపేట వరకు ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మించబడినందున ఆటో డ్రైవర్లు అప్రమత్తతతో వాహనాన్ని నడపాలన్నారు. గ్రామాల నుంచి జాతీయ రహదారి కలిసే దగ్గర జాగ్రత్త వహించాలన్నారు. అలాగే జాతీయ రహదారి వెంబడి వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా ఎడమవైపున ఉన్న లైన్లోనే వెళ్లాలన్నారు. సర్వీసు రోడ్డు ఉన్న దగ్గర ఖచ్చితంగా సర్వీస్ రోడ్లో వెళ్లాలని తెలిపారు. ఈ జాతీయ రహదారిపై వాహనాలు అతివేగంగా వచ్చే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ వ్యతిరేక మార్గంలో ప్రయాణించరాదన్నారు. ఎవరైనా నియమ నిబంధనలు ఉల్లంఘించి... సరైన రికార్డ్స్ లేకుండా వాహనాన్ని నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

22న 'మహాశివరాత్రి' పై కలెక్టరు సమీక్ష

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల 21వ తేదీ నుంచి నిర్వహించనున్న మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలపై ఈ నెల 22వ తేదీ బుధవారం ఉదయం 11గంటలకు తిరుపతి కలెక్టరు డాక్టర్ ఎస్.వేంకటేశ్వర్ సమీక్ష నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముక్కంటి ఆలయ పరిపాలన భవనంలో జరిగే ఈ సమీక్షకు అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు చిలక మహాలక్ష్మి ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర-తొట్టంబేడు: శ్రీకాళహస్తి పట్టణ శివారులో చెన్నై రోడ్డులో వెలసిన చిలక మహాలక్ష్మి ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం ఉదయం 9.30గంటలకు భూమి పూజ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు వారు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయంతో పాటు ప్రహరీ కూడా నిర్మించనున్నట్లు వారు తెలిపారు. ఈ భూమిపూజ కార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

బీటీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గుడిపాల: గుడిపాల మండలంలోని ఎం.సి.ఆర్ క్రాస్ వద్ద నుండి వేలూరుకు వెళ్లే బీటీ రోడ్డును ఈ ఆదివారం ఉదయం 10 గంటలకు చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ తో కలసి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ రోడ్డు పనులు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధి, మరమ్మ తులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు, గత ఐదు సంవత్సరములుగా ఉన్న సుమారు 2 కిలో మీటర్ల ఈ రోడ్డు కనీసం మరమ్మత్తులకు నోచుకోకుండా వాహన చోదకుల అవస్థలను పత్రికా కథనాలపై స్పందించిన చిత్తూరు ఎమ్మెల్యే. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రోడ్ల మరమ్మత్తు కార్యక్రమంలో భాగంగా అద్వాన స్థితిలో ఉన్న ఈ బీటీ రోడ్డు పై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రభుత్వం వద్ద నుంచి సుమారు 2.3 కోట్ల రూపాయల మంజూరు చేసిన చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్. వేలూరు రోడ్డులో వై జంక్షన్ నుంచి ఆంధ్ర సరిహద్దు వరకు రోడ్డు గుంతల మయమై వాహన దారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది, ఈ పరిస్థితుల్లో రోడ్డును అభివృద్ధి చేయడం కోసం ఇటీవల జిల్లా కలెక్టర్, ఎం.ఎల్.ఏ కలిసి గత నెలలో ఇరువురు రోడ్డును పరిశీలించి రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని నాణ్యమైన నిర్మాణంతో శరవేగంగా పనులు పూర్తి చేయాలని ఆర్ అండ్ బి

అధికారులను ఆదేశించారు, ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ఈ కార్యక్రమంలో పి ఆర్ ఎస్ఈ చంద్ర శేఖర్ రెడ్డి, ఆర్ %ఁ% బి ఈఈ శ్రీనివాసులు, డిఈ దస్తగిరి, తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీఓ శివరాజ్, సంబంధిత అధికారులు, మాజీ శాసనసభ్యులు ఆర్ గాంధీ, బాలాజీ నాయుడు, మండల అధ్యక్షుడు చలి చీమల సుబ్రహ్మణ్యం నాయుడు, మండల ఉపాధ్యక్షుడు దేవపత్ని అనిల్ చౌదరి,గొల్ల హరి చౌదరి, తెదేపా పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు ఈ భూమి పూజలో పాల్గొన్నారు.

గో బ్యాక్ అమిత్ షా...

అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలి

- సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి శశి కుమార్

విశాలాంధ్ర-గూడూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే ఆంధ్ర ప్రదేశ్ నుండి వెళ్లి పోవాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.ఆదివారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ కూడలి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి శశి కుమార్ మాట్లాడుతూ పార్లమెంట్ వేదిక గా నిండు సభలో రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా కు దేశ ప్రధాని మద్దతు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మా గారానికి తూ తూ మంత్రం గా ప్యాకేజీ ప్రకటించి , రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టి ఉక్కు పరిశ్రమను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన హామీలను వెంటనే కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా బిజెపి అధికారంలోకి రాగానే రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి, నిరుద్యోగులను గాలికి వదిలేసారని పేర్కొన్నారు.బీజేపీ దేశంలో కార్పొరేట్లకు ఉడిగం చేస్తూ కార్మిక చట్టాలను నీరు గారుస్తుందన్నారు. ఇకనైనా కేంద్ర హోం మంత్రి అమిత్ షా అంబేద్కర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఎం ఆర్గనైజర్ జోగి శివకుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంతో పదవులు పొందుతూ అంబేద్కర్ ను కేంద్ర హోం మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సబబు అని డిమాండ్ చేశారు. ఇకనైనాఅమిత్ షా ను పార్టీ కేంద్ర హోం మంత్రి పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి.హెచ్.పి.ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎంబ టిచంద్రయ్య, ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు తలారి మస్తానయ్య, ఇన్సాఫ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి జమాలుల్లా, సిపిఎం నాయకులు టి.రామిరెడ్డి, సురేష్, అడపాల ప్రసాద్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యోగి వేమారెడ్డి జయంతి వేడుకలు

చిన్నారులకు ప్రోత్సాహకాలు... కవులకు సన్మానం

వేమన కీర్తి అజరామరం అని కొనియాడిన కవులు

విశాలాంధ్ర-పలమనేరు : పలమనేరులో యోగి వేమారెడ్డి జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పలమనేరు పట్టణంలోని నాగమంగళం వద్దనున్న యోగి వేమారెడ్డి ఉద్యానవనంలో అధికారికంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యోగివేమన విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం వందకు పైగా వేమన పద్యాలు ఆలపించిన చిన్నారులకు ప్రోత్సాహకంగా నగదు బహుమతిని అందజేశారు. అనంతరం కవులు రచయితలైన డి. కుమార స్వామి రెడ్డి, డాక్టర్ మల్లిచెట్ల దేవేంద్ర, గండికోట వారిజ, రెడ్డి ప్రకాష్ అశోక్, బాలకృష్ణమూర్తి లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు కవులు వేమన కీర్తి అజరామరమని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమాలలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జగ్గయ్య, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు సోమ సుందర్ రెడ్డి, ఉమాదేవి, మీనాక్షిలతో పాటు తెలుగుదేశం పార్టీ వీకోట బైరెడ్డిపల్లి మండలాల అధ్యక్షులు రంగనాథ్, కిషోర్ గౌడ, పెద్దపంజాని మాజీ ఎంపీపీ విజయ భాస్కర్ రెడ్డి,ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం సలహాదారు రెడ్డివారి అమర్నాథ్ రెడ్డి, టమోటా మండి యజమాని జయరామిరెడ్డి, స్థానిక నాయకులు మాజీ ఇంటలిజెన్స్ అధికారి సుబ్రమణ్యం రెడ్డి మల్లీశ్వర రెడ్డి, వెంకట ముని రెడ్డి,వేమా రెడ్డి మరియు పట్టణ నాయకులు సుధాకర్, లోకేష్, శీను,సుబ్బు, బాబాజాన్, అస్లాం, మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

- ఏఐటియుసి నియోజక వర్గ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-గూడూరు : స్మార్ట్ మీటర్లను, రైతులు, ప్రజలు , వ్యాపారస్తులు కలిసి స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి నారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏ. ఐ.టి.యు. సి నియోజక వర్గ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ రైతులు, ప్రజలు పాలిట భారంగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు తక్షణమే ఆపాలని పేర్కొన్నారు.ఇప్పటికే ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజల పై భారం పడిందన్నారు.ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలనిపేర్కొన్నారు అని, నేడు స్మార్ట్ మీటర్ల బిగింపుకు అనుమతులు ఎలా ఇచ్చారో తెలపాలని డిమాండ్ చేశారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బిగింపు ను ఆపివేయాలని పేర్కొన్నారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర- పుత్తూరు: పుత్తూరు మండలం వేపగుంట రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి రైలు నుంచి కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ రవి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు తిరుపతి నుంచి చెన్నైకి వెళుతున్న ట్రైన్ నుంచి సుమారు 40 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. మృతుడు సిమెంట్ కలర్ టీషర్టు, బ్లాక్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. ఎడమ బాతిపై నల్లని పుట్టు మచ్చ ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పుత్తూరు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి:

పుత్తూరు మండల పరిధిలోని ఉత్తరపు కండ్రిగ గ్రామం వద్ద ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ ఓబయ్య కథనం మేరకు పుత్తూరు గణపతి నగర్కు చెందిన ప్రకాష్(45) పుత్తూరు వైపు నడచి వస్తుండగా వెనక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ. కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహంపై నుంచి పలు వాహనాలు వెళ్లడంతో మృతదేహాన్ని గుర్తు పట్టలేని విధంగా తయారైంది. మృతుడి అన్న సెల్వరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-పుంగనూరు: పట్టణంలోని వారాహి గ్రూప్స్ ఫౌండర్ హేమంత్ రాయల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ఆదివారం రోజున విశేష స్పందన రావడం జరిగింది ఈ వైద్య శిబిరానికి దాదాపు 250 మంది వైద్యసికిత్సలు నిర్వహించుకోవడానికి రావడం జరిగింది వారికి బెంగళూరు వైదేహి వైద్యశాల డాక్టర్లు రోగులకు ఉచితంగా చికిత్సలు నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిబిరం నందు రోగులకు గుండె కిడ్నీ దయాలసిస్ గ్యాస్ ఎట్రాలజీ సంబంధించిన చికిత్సలు నిర్వహించడం జరిగింది. దాదాపు 17 మందిని సర్జరీలకు ఎంపిక చేసి వారందరికీ వైదేహి వైద్యశాల నందు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించడం జరుగుతుందని వైద్య బృందం తెలిపారు. ఈ సందర్భంగా వారాహి గ్రూప్ ఫౌండర్ హేమంత్ రాయల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. దీనివలన ఆయా జబ్బులకు సంబంధించిన వారు వైద్యచికిత్సలు నిర్వహించుకోవడం జరిగిందన్నారు మా వారాహి గ్రూప్ తరపున ఈ మహోన్నత కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు వారాహి గ్రూప్స్ నుండి నిర్వహిస్తామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాఘవి వరలక్ష్మి జయలక్ష్మి కావున శ్రీనిధి మానస అను మౌనిక త్రిలోక్ అప్రోచ్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో కలెక్టరు కుటుంబ సభ్యులు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళ హస్తీశ్వరస్వామిని ఆదివారం చిత్తూరు కలెక్టరు సుమిత్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఈయనకు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఏఈవో విద్యాసాగర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేవేంద్ర కుటుంబాన్ని ఆదుకుంటాం: ఎమ్మెల్యే థామస్

విశాలాంధ్ర-కార్వేటినగరం :ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన డిఎం పురం పంచాయతీ మూల కండిగా గ్రామంలో ఎం. చెంచయ్య, జయలక్ష్మి కుమారుడు మంబలా దేవేంద్ర టిడిపి కార్యకర్త గుండెపోటుతో మృతి చెందిన విషయం విధితమే, జిడి నెల్లూరు ప్రభుత్వ విప్ శాసన సభ్యులు డాక్టర్ థామస్ ఆదివారం మూలకండిగా గ్రామంలో మృతి చెందిన దేవేంద్ర కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎ మ్మెల్యే భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షులు చెంగల్రాయల్ యాదవ్, కార్యదర్శి రాజేంద్ర రెడ్డి, జిల్లా తెలుగు యువత కార్యదర్శి బిగల రమేష్, టిడిపి నాయకులు సోమశేఖర్ యాదవ్, సుబ్రహ్మణ్యం, పాపయ్య, ప్రహ్లాద్, ఎర్రబ్బ, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ని ఢీ కొని

పొదల్లోకి దూసుకెళ్లిన కారు

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : తిరుమల ఘాట్ రోడ్ లో కారు అదుపుతప్పి డివైడర్ ఢీ కొట్టింది తిరుమల మొదటి ఘాట్ రోడ్ లోని ఏడవ మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది ఈ ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు వారిలో చిన్న పిల్లలు కూడా ఉన్నారు కారు అదుపుతప్పి డివై డర్ ఢీ కొట్టి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది సమాచారం అందుకున్న టీటీడీ విజిలెన్స్ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షత గాత్రులను108 అంబులెన్స్ ద్వారా తిరుమల అశ్విని ఆసుపత్రికి తరలించారు సంబందింత అధికారులు తగిన చర్యలు తీసుకుని ప్రమాదాలు జరగకుండా చూడాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు మొదటి ఘాట్లో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

నేటి నుండి ఉచిత పశు వైద్య శిబిరాలు

విశాలాంధ్ర -పాకాల : పాకాల మండలంలో నేటి నుండి 31వ తేదీ వరకు ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వహించ నున్నట్లు మండల పశు వైద్య సంచాలకులు డాక్టర్ శ్రీధర్ , మండల పశు వైద్యాధికారిణి డాక్టర్ జానకమ్మ లు తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, పశు వైద్య శిబిరం ల ద్వారా నట్టల నివారణకు మందులు, గర్భకోశ వ్యాధులకు చికిత్స , పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు , వ్యాధి నిరోధక టీకాలు , ఉచితంగా అందించడంతోపాటు శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని కావున పాడి రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంని

సత్కరించిన పి.గోపి రాయల్

విశాలాంధ్ర- పుత్తూరు: శాసన మండలి సభ్యులు, తిరుపతి రష్ హాస్పిటల్ అధినేత చైర్మన్, వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గం జాతీయ నాయకులు, ప్రజా నాయకులు, డాక్టర్ సిపాయి సుబ్రహ్మ ణ్యం జాతీయ కాపు సంఘం ప్రచార కార్యదర్శి. పుత్తూరు బలిజ సంఘం నాయకుడు పి గోపి రాయల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఆదివారం పుత్తూరుకు విచ్చేసిన సందర్భంగా వారికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంని సత్కరించి శాలు వాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఎమ్మెల్సీగా మొట మొదటిసారి పుత్తూరు పట్టణానికి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ కాపు సంఘం ప్రచార కార్యదర్శి, పుత్తూరు బలిజ సంఘం నాయకుడు పి గోపి రాయల్, సంఘ నాయకులు నారాయణ ప్రసాద్, సి. మునిరత్నం, టైలర్ సంఘ నాయకుడు పాల్గొన్నారు.

వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు మండలంలోని చెన్నూరు గ్రామ సమీపంలో ఓ వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేయడంతో గాయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ మాట్లాడుతూ చెన్నూరు గ్రామానికి చెందిన మనోహర్ అనే వ్యక్తి గూడూరులోని ఓ ప్రైవేటు కర్మాగారంలో పనిచేస్తుంటాడు. ఆదివారం వేకువన పనులు ముగించుకుని మనోహర్ సైకిల్పై చెన్నూరు గ్రామానికి వెళ్తున్నాడు. అదే సమయంలో చెన్నూరు సమీపంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు మోటారుసైకిల్ పై వచ్చి మనోహర్ ను అడ్డగించి అతనిపై దాడి చేసి అతని వద్ద నుంచి సెల్ఫోన్, 70 రూపాయలు నగదును అపహరించుకువెళ్లారు. గాయపడిన మనోహర్ ను చికిత్సనిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఓం శక్తి అమ్మవారికి అంబలితో కూడిన

ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - రామచంద్రపురం: మండల పరిధిలోని రాయలచెరువు పేటలో గంగమ్మ ఆలయంలో ఓం శక్తి భక్తులు అమ్మవారి చిత్రాలను ఏర్పాటు చేసుకొని పూజలు చేస్తున్నారు. భక్తులు ఆదివారం ఓంశక్తి భక్తులు ఓంశక్తి ఓంశక్తి అంటూ అంబళ్ళును పంబలి వాయిద్యాలు నడుమ ఆలయానికి తీసుకుని వచ్చి అమ్మవారికి నైవేద్యంగా పెట్టి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అంబలిని పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు తణుకు మునిరాజు మాట్లాడుతూ సోమవారం ఓం శక్తి మాల ధారణ చేసిన భక్తులు తమిళనాడు మేల్ మరువత్తూర్ లోని అమ్మవారి సన్నిధిలో ఇరుముడులు చెల్లించడానికి బయలుదేరనున్నట్లు తెలిపారు. అలాగే నేడు మధ్యాహ్నం కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీం ప్రతినిధులు శివరామయ్య, జనా ర్ధన్, మురళి, బాబు రెడ్డి, వాసు, ఓం శక్తి భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉపకులాల వర్గీకరణపై రేపు

చిత్తూరులో కమిషన్ విచారణ

విశాలాంధ్ర- సత్యవేడు: షెడ్యూల్ కులాలకు సంబంధించి ఉపకులాల వర్గీకరణపై జనవరి 21వ తేదీ ఏకసభ్య కమిషన్ విచారణ చేసి వినతులను స్వీకరిస్తుందని సత్యవేడు ఏఎస్ డబ్ల్యుఓ కృష్ణ పేర్కొన్నారు.చిత్తూరు కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశపు హాల్లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా షెడ్యూల్ కులాల వివిధ వర్గాల నుంచి వినతులు స్వీకరిస్తారని ఆయన చెప్పారు.ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల్లోనూ, విద్యాసంస్థల్లోనూ ప్రాతినిధ్యంతో పాటు సామాజిక,ఆర్థిక,రాజకీయ వెనుకబాటుకు సంబంధించిన పలు అంశాలపై షెడ్యూల్ కులాల సంఘాల నుంచి వారి అభిప్రాయాలను ఏక సభ్య కమిషన్ స్వీకరించి విచారణ చేస్తుందని ఆయన వివరించారు.తద్వారా నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తుందన్నారు. అందువల్ల చిత్తూరు,తిరుపతి జిల్లాల షెడ్యూల్ కులాల పౌరులు,సంఘాలు,సంస్థలు వారి అభిప్రాయాలను వినత రూపంలో కమిషన్ చైర్మన్కు సమర్పించుకోవచ్చని ఆయన కోరారు.

సందడి చేసిన సంక్రాంతి వచ్చింది చిత్ర యూనిట్

థియేటర్లో ప్రేక్షకులలో కేక పుట్టించిన హీరోయిన్లు

విశాలాంధ్ర-తిరుపతి: ఈ సంక్రాంతి పండుగ సందర్భంగా ఎన్నో భారీ చిత్రాలు విడుదలైనాయి. వీరిలో మహిళలకు నచ్చే కుటుంబాలు మెచ్చే చిత్రంగా సంక్రాంతికి వస్తున్నాం చిత్రం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.ఆదివారం చిత్ర యూనిట్ తిరుమల శ్రీవారిని దర్శించుకుని అనంతరం స్థానిక జయశ్యామ్ థియేటర్ నందు ప్రదర్శించబడుతున్న సంక్రాంతి వచ్చింది. చిత్రాన్ని తిలకించడానికి , అలాగే ప్రేక్షకుల మధ్య గడపడానికి ఆ చిత్ర యూనిట్ వచ్చింది. ఈ సినిమాలో సన్నివేశాలను , డైలాగులను హీరోయిన్లతో కలిసి స్టెప్పులు వేస్తూ అభిమానులు ఆనందిస్తూ కేరింతలు కొట్టారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్ రాజు నిర్మాతగా, అనిల్ రావి పూడి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో విజయవంతం అయిందని ఈ చిత్ర రథసారథులు కొనియాడారు. థియేటర్ నిర్వాహకులు. ఎన్ వి ప్రసాద్ , ఆర్ సి మునికృష్ణ మరియు సిబ్బంది , పోలీసులు ఈ గ్రాటిట్యూడ్ విజిట్ ను థియేటర్లో ఎటువంటి తొక్కిసలాట లేకుండా విజయవంతం చేశారు.

కవచ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

విజేతలకు బహుమతులు

విశాలాంధ్ర-వెంకటగిరి: విశాలాంధ్ర వెంకటగిరి సంక్రాంతి సంబరాల్లో భాగంగా, వెంకటగిరి మున్సిపాలిటీ 8 వార్డు పరిధిలో, రైల్వే స్టేషన్ యూత్, సాల్మన్ ,సాయి రాయల్ ఆధ్వర్యంలో నిర్వహించిన, క్రికెట్ పోటీల్లో విజయం సాధించిన మోమెంటోలు, ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ కొరకు ముఖ్య అతిథిగా ప్రముఖ న్యాయవాది, కవచ చారిటబుల్ ట్రస్ట్ అధినేత గుండు మనోజ్ విచ్చేసి గెలుపొందిన వారికి ,బహుమతులు అందించినారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్, 8వ వార్డ్ కౌన్సిలర్ శాతవాని బాలయ్య, శ్రీమతి జలగం కామాక్షి మరియు అల్లం మల్లీశ్వరి పాల్గొన్నారు.

టిడిపి శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్న పప్పు చంద్రమౌళి రెడ్డి

విశాలాంధ్ర-వెంకటగిరి: వెంకటగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు లక్ష రూపాయలు చెల్లించి తెలుగుదేశం పార్టీ జీవితకాల శాశ్వత సభ్యత్వాన్ని చేసుకొన్న వెంకటగిరి రూరల్ మండల అధ్యక్షులు పప్పు చంద్రమౌళి రెడ్డి తీసుకున్నారు.

ట్రాఫిక్ వలయం

శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద ఇదీ పరిస్థితి

-నాలుగో గేటు వద్ద తప్పని తిప్పలు - ఆటో వాలాలతో మరింత కష్టం

విశాలాంధ్ర- శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుకుని ఉండే సన్నిధి వీధి మార్గంలో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. మరీ నాలుగో గేటు వద్ద ఈ కష్టాలు మరింత ఎక్కువ. విశాలంగానున్నా రోడ్డుకు అడ్డదిడ్డంగా వాహనాలను ఇక్కడ పార్కింగ్ చేస్తున్నారు. దీనికితోడు ఆటోలు నియమ నిబంధనలు పాటించడం లేదు. ఫలితంగా ఇక్కడ ట్రాఫిక్ సమస్య తలనొప్పిగా పరిణమిస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి ముక్కంటీశుని దర్శనార్థం ఇక్కడకు వచ్చే భక్తుల సంఖ్య అధికంగా ఉంటోంది. మరీ వాహనాల్లో వచ్చే వారు ఎక్కువ. భక్తులు విడిది చేయడానికి దేవస్థానం అద్దె గదులను తీసుకోవడానికి ఈ నాలుగో గేటు ద్వారానే సీఆర్వో కార్యాలయం వద్దకు రావాలి. అలాగే సన్నిధివీధిలో నాలుగు గేటు ముందు నుంచి వెనుక భరద్వాజతీర్థం వరకు ప్రైవేటు లాడ్జీలు ఎక్కువగా ఉన్నాయి. మరోపక్క ఆలయానికి వచ్చే వీఐపీలు ఈ మార్గం గుండానే చేరుకోవాల్సి ఉంది. అంతేకాక ఆలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఈ మార్గం గుండానే తమ విధులకు హాజరుకావాలి. దీనినిబట్టి ఈ మార్గంలో వాహన రాకపోకల పరిస్థితి తెలుస్తోంది. ఇలా నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో భక్తులు వాహనాలు రోడ్డుకు అటు ఇటు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయేస్తున్నారు. దీనికితోడు నాలుగో గేటు ముందు నుంచి ఎదురు, పరిసర ప్రాంతాల్లో ఆటోలు నిలిపేస్తున్నారు. అధికారికంగా ఆటో స్టాండుగా మార్చేశారు. భరద్వాజతీర్థంలోని దేవస్థాన అతిథిగృహాలు, ప్రైవేటు లాడ్జీలలో విడిది చేసిన భక్తులు ముక్కంటి దర్శనానంతరం తమ స్థానాలకు వెళ్లడానికి ఆటోలను ఆశ్రయిస్తున్నారు. దీనికితోడు శ్రీకాళహస్తీశ్వరుని దర్శనం తర్వాత బస్టాండు, రైల్వే స్టేషన్ వరకు వెళ్లడానికి ఆటోల అవసరం తప్పడం లేదు. అలాగే వేయిలింగాల కోన, వేదం దక్షిణ కాళికాదేవి ఆలయం తదితర అనుబంధ దేవాలయాల సందర్శనకు భక్తులు వెళ్తుంటారు. వాహనాల్లో వచ్చే వారే కాకుండా మిగిలిన భక్తులకు కూడా ఆటోల అవసరం ఉంటోంది. దీంతో ఆటో వాలాలు ఇదే అదునుగా ట్రాఫిక్ సమస్యను అసలు పట్టించుకోకుండా తమ ఎక్కడపడితే అక్కడ తమ వాహనాలను ఆపేస్తున్నారు. నాలుగో గేటు వద్దే ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. ఈ గేటుకు ఎదురుగా ఉండే శ్రీకృష్ణ మందిరం ముందు, పరిసరాల్లో పార్కింగ్ చేసి భక్తుల కోసం గేటు వద్ద డ్రైవర్లు ఉంటున్నారు. దీంతో అటూ, ఇటూ వచ్చే వాహనాలు అడ్డదిడ్డంగా ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేసిన వాహనాలు, ఆటోలతో ముందుకు వెళ్లలేక ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంటున్నారు. ఒక్కో సందర్భంలో వీఐపీల వాహనాలు వస్తే సమస్య మరింత జఠిలంగా మారుతోంది. ఈ సన్నిధివీధిలో నెలకొన్న ట్రాఫిక్ చిక్కులు తప్పించడానికి రోడ్డు ముందుకొచ్చిన దుకాణ ఆక్రమణలను ఇటీవల అధికారులు తొలగించారు. అప్పటి నుంచి రోడ్డు కాస్త విశాలమై రాకపోకలకు అనుకూలంగా మారింది. కానీ ఈ నాలుగో గేటు వద్ద మాత్రం పరిస్థితిలో మార్పు రావడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ గేటు వద్ద నెలకొన్న సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని భక్తులు, ప్రజలు కోరుతున్నారు.

యం'కరి' బీభత్సం

- నారావారిపల్లెలో అర్ధరాత్రి గజరాజుల అలజడి - ఏనుగుల దాడిలో టీటీపీ యువనాయకుడు దుర్మరణం

- తొండంతో విసిరేసి, కాళ్లతో తొక్కేసి చంపిన వైనం

విశాలాంధ్ర -తిరుపతి కార్పొరేషన్: జిల్లాలో శనివారం అర్ధరాత్రి గజరాజులు బీభత్సం సృష్టించాయి. చంద్రగిరి మండలంలోని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంత గ్రామం నారావారిపల్లెలో ఏనుగులు గుంపులు గుంపులుగా సంచరిస్తూ స్థానిక ప్రజలను బెంబేలెత్తించాయి. ఏనుగులను దారిమళ్లించడానికి యత్నించిన టీడీపీకి చెందిన యువనాయకుడుని తొక్కి చంపేశాయి. స్థానికుల వివరాలు.. చంద్రగిరి మండలం నారా వారిపల్లెలో మారు పూరి రాకేష్ చౌదరి ఉపసర్పంచ్‌గా పని చేస్తున్నాడు. ఐటీడీపీ చంద్రగిరి మండల అధ్యక్షుడిగా రాకేష్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత కొంగర వారి పల్లె, పాతపాటివారిపల్లె సమీపంలోని మొక్కలతోపు వద్దకు శనివారం రాత్రి ఏనుగుల గుంపు పంటలపై దాడికి దిగింది. దీంతో మామిడి మానుగడ్డకు చెందిన కందులవారిపల్లె ఉప సర్పంచ్ రాకేష్ చౌదరిమరికొంతమంది కలిసి ఏనుగులను తరిమేందుకు ప్రయత్నించారు.

తిరగబడ్డ ఏనుగులు

ఏనుగులను దారిమళ్లేందుకు క్రమంలో అవి ఎదురుతిరిగాయి. ఏనుగులను తరిమేందుకు వచ్చిన ఓ వ్యక్తిపై దాడిచేశాయి. దీంతో రైతులు అందరూ ఏనుగుల బారి నుంచి తప్పించుకునేందుకు తలా ఓ చెట్టును ఎక్కేశారు. టార్చ్ లైట్లను ఆఫ్ చేశారు. అయితే రాకేష్ వారి కంటే కాస్త ముందున్నాడు. తెలుపు రంగు టీ షర్టు వేసుకుని టార్చ్ లైట్ వేశాడు. దీంతో ఏనుగులు అతనిపై దాడిచేశాయి. తొండంతో ఎత్తి చెట్ల కేసి బాదాయి. ఆపై నేలకేసి తొక్కేశాయి. దీంతో రాకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం ఏనుగులు అక్కడ నుంచి వెళ్లిపోయాయి.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

ఘటన జరిగినట్లు తెలియడంతో సుమారు 100 మందికి పైగా గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని హుటాహుటిన అర్ధరాత్రి సంఘటనా స్థలానికి చేరుకుని ఘటన జరిగిన తీరును స్థానికులను, అటవీ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏనుగులను తరిమే ప్రయత్నంలో ఈ సంఘటన సంభవించినట్లు వారు ఎమ్మెల్యేకు వివరించారు. రాకేష్ మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. టీడీపీ కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

మామిడిమాను గడ్డలో ఆదివారం మధ్యాహ్నం రాకేష్ చౌదరి అంత్యక్రియలు జరిగాయి. ఎమ్మెల్యే పులివర్తి నానీ అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. శనివారం అర్ధరాత్రి ఘటన జరిగినప్పటి నుంచి అంత్యక్రియలు పూర్తయ్యే వరకు పులివర్తి నానీ దగ్గరుండి అన్ని పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి రాకేష్ కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు. ఈ అంత్యక్రియలకు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.

అందరితో కలివిడిగా

రాకేష్ చౌదరికి గ్రామంలో సౌమ్యుడిగా పేరుంది. అర్ధరాత్రి ఏనుగులు పంట పొలాలపై దాడులకు తెగబడ్డాయని తెలిసి స్థానికులతో కలిసి వాటిని తరిమేందుకు వెళ్లాడు. అయితే ఏనుగుల దాడిలో ప్రాణాలు కోల్పోయాడు. అప్పటి వరకు తమతో పాటు సరదాగా గడిపిన రాకేష్ చనిపోయాడని తెలిసి ప్రజలు కన్నీరు మున్నీరుగా విలపించారు.

అమిత్ షాకు ముక్కంటి ప్రసాదాలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా కు విజయవాడలో ఆదివారం ఎంజీఎం గ్రూప్స్ డైరెక్టరు గుడ్లూరు మయూర్ శ్రీకాళహస్తీశ్వరస్వామి ప్రసాదాలు అందజేశారు. అమిత్ షాను విజయవాడలోని నోవాటెల్ హెూటల్ లో గుడ్లూరు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను ముక్కంటి శేష వస్త్రంతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు. శ్రీకాళహస్తిలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు.

టిటిడికి రూ.6 కోట్ల విరాళం

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: చెన్నైకి చెందిన దాత వర్ధమాన్ జైన్ ఆదివారం టిటిడి ట్రస్టులకు రూ.6 కోట్లు విరాళంగా అందించారు. తిరుమల ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఆయన ఎస్వీబీసీ కోసం రూ.5 కోట్లు, ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్ కోసం రూ. కోటి విలువైన డిడిలను టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరికి అందజేశారు. టిటిడి ట్రస్టులకు గతంలో దాత అనేక మార్లు విరాళంగా అందజేశారు.

ఫ్లెమింగో ఫెస్టివల్‌లో శ్రీసిటీ స్టాలుకు విశేష స్పందన

విశాలాంధ్ర-సత్యవేడు: సూళ్లూరుపేటలోని ఫ్లెమింగో ఫెస్టివల్ మైదానంలో ఏర్పాటు చేసిన శ్రీసిటీ స్టాల్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు, పర్యాటకులు, సామాన్య ప్రజల సందర్శన తో విశేష స్పందన లభించింది. ఈస్టాల్లో చాక్లెట్లు, ఆహార పదార్థాలు, ఎయిర్ కండిషనర్లు, ఆటోమొబైల్ విడిభాగాలు, ఎలక్ట్రానిక్స్, లైట్ ఇంజినీరింగ్ రంగాల ఉత్పత్తుల నమూనాలతో శ్రీసిటీ ప్రగతిని దృశ్య మాధ్యమంగా అద్భుతంగా ప్రదర్శించారు. పారిశ్రామిక విజయాలతో పాటు, సుస్థిరత, సామాజిక సంక్షేమం పట్ల శ్రీసిటీ నిబద్ధతను స్టాల్ హైలైట్ చేసింది. పరిశ్రమలతో పాటు హరిత హిత కార్యక్రమాలు, సమాజ శ్రేయస్సు కోసం చేపట్టిన కార్పొరేట్ సామాజిక బాధ్యతా సిఎస్ఆర్ ప్రాజెక్టులు, ప్రకృతి సంరక్షణ, జీవ వైవిధ్యాన్ని ప్రోత్సహించడానికి తీసుకున్న చర్యలను ప్రతిబింబించే ఆకర్షణీయ ఫోటో డిస్ప్లేలు సందర్శ కులను ఆకట్టుకున్నాయి. శ్రీసిటీ ప్రస్థానాన్ని వివరిస్తూ సాగిన వీడియో ప్రదర్శనలు అందరినీ ఆకర్షించాయి. పారిశ్రామిక పురోగతినే కాకుండా స్థిరమైన అభివృద్ధిలో దానికున్న ప్రాధాన్యతను హైలైట్ చేస్తూ ఏర్పాటు చేసిన శ్రీసిటీ స్టాల్ సందర్శకులపై బలమైన ముద్రవేసింది. సమాజం, పర్యావరణం పట్ల శ్రీసిటీ యాజమాన్య బాధ్యతాయుత చర్యలను సందర్శకులు ప్రశంసించారు. ఈ ప్రదర్శనను శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమా శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించిన విషయం తెలిసినదే. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలతో ప్రదర్శన ప్రాంగణంలో నీరు నిలిచినా, సందర్శకులకు ఇబ్బందులు కలుగకుండా ఫెస్టివల్ నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే యువ రైతు మృతి

- బాధిత కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలి
- అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఇంకా ఎంతమంది రైతులు బలి కావాలి
- పంటలు నష్టపోకుండా గజరాజుల నుండి చర్యలు చేపట్టలేరా?
- రాకేష్ మృతదేహానికి నివాళులర్పించిన రైతు సంఘం నేతలు
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.రామానాయుడు

విశాలాంధ్ర-తిరుపతి: శనివారం రాత్రి ఏనుగుల దాడిలో మృతి చెందిన రాకేష్ మృతదేహానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కొంగర వారి పల్లి నందు నివాళు లర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఏపికెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.రామానాయుడు మాట్లాడుతూ.. ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల యువకుడు రాకేష్ మృతి చెందాడని, దీనికి తగిన మూల్యం ఫారెస్ట్ అధికారులే చెల్లించాలన్నారు. గత నెల రోజుల నుంచి ఏనుగులు పొలాలపై దాడి చేస్తున్నాయని పంటలు మొత్తం ధ్వంసం చేస్తున్నాయని అధికారులకి రైతులు ఎన్నిసార్లు విన్నపించుకున్నా పట్టించుకోకుండా పోవడం వల్లనే ఈ ఘటన జరిగిందని, రైతులు వేసుకున్న పంటలు కాపాడుకోవడం కోసము పోయి తన ప్రాణాలను వదులుకోవడం బాధాకరమన్నారు. ఫారెస్ట్‌కు దగ్గరగా ఉన్న భూముల్లో కందకాలు తవ్వండని ఫారెస్ట్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వారు పట్టించుకోకుండా పోయిన పాపమే ఈ దుర్ఘటనకు కారణం అన్నారు. ఫారెస్ట్ అధికారులు రైతుల పొలాలను తీసుకొని సంవత్సరానికి అమరావతిలో రైతులకు ఇస్తున్నటువంటి పంటల పథకాన్ని (కౌలును) ఇక్కడ కూడా అమలు చేస్తే మంచిదన్నారు. రైతు పొలాల్లో ఉన్న పంటను కాపాడడానికి రైతు పొలాల్లోకి వెళ్లి ఏనుగుల దాడిలో మరణించిన రాకేష్ చౌదరికి రైతు సంఘం తరపున నివాళులర్పించారు. రాకేష్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం 25 లక్షలు రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగాన్ని ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నివాళులర్పించిన వారిలో ఏపికెఎస్ నాయకులు పద్మనాభరెడ్డి, గోవిందస్వామి, శివారెడ్డి తదితరులు ఉన్నారు.

టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ వెబ్ సైట్‌ను ప్రారంభించిన డాలర్స్ దివాకర్ రెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి: ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ వెబ్ సైట్ ను టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, డాలర్స్ గ్రూప్ అధినేత డాక్టర్ సి దివాకర్ రెడ్డి ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక డాలర్స్ గ్రూప్ కార్యాలయంలో అసోసియేషన్ ప్రతినిధు లతో కలిసి ప్రారంభించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే ప్రాథమిక స్థాయిలో టెన్నిస్ బాల్ క్రికెట్ లోనే శిక్షణ ఉంటుందన్నారు. అంత ప్రాధాన్యత గల టెన్నిస్ బాల్ క్రికెట్‌కు మరింత ప్రాచుర్యం కల్పించేం దుకు అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఔత్సాహికుల కోసం ప్రత్యేక వెబ్ సైట్‌ను పొందించడం అభినంద నీయమన్నారు. యువ క్రికెటర్లు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ చైర్మన్ సురేష్, జనరల్ సెక్రెటరీ ఆర్‌డి ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ అజయ్ కుమార్, తిరుపతి జిల్లా సెక్రెటరీ మనోహర్, సభ్యులు పాల్గొన్నారు. వెబ్సైట్ https://www.aptbca.com

అయోధ్యలో శ్రీవారికి వైభవంగా స్నపన తిరుమంజనం

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: అయోధ్యలో శ్రీ శ్రీనివాసునికి స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని ఆదివారం టీటీడీ వైభవంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు దంపతులు హాజరయ్యారు. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో అర్చకుల బృందం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ శ్రీనివాసస్వామి వారికి స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని సరయూ నది ఒడ్డున కన్నుల పండువగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో నిర్వహించిన స్నపన తిరుమంజనం కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఉత్తరాది భక్తులు హాజరయయ్యారు. ఈ సందర్భంగా వేద పండితులు పంచ సూక్తాలైన శ్రీ సూక్తం, భూసూక్తం, నీలా సూక్తం, పురుష సూక్తాలను అర్చకులు వల్లించారు. అభిషేకానంతరం తులసి మాలలతో ఉత్సవ మూర్తులను అలంకరించారు. సహస్రధారాపాత్రతో అభిషేక కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, హెచ్ డీపీపీ సెక్రెటరీ శ్రీరామ్ రఘునాథ్, ఏఈవో ప్రభాకర్ రెడ్డి, బొక్కసం ఇన్ ఛార్జ్ గురురాజ స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అమిత్ షా గో బ్యాక్

చిత్తూరులో సిపిఐ నిరసన

విశాలాంధ్ర-చిత్తూరు: భారత దేశానికి రాజ్యాంగాన్ని రచించి దిశ, దశ కల్పించిన ప్రపంచ మేధావి అందరివాడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం పై ప్రమాణం చేసి పదవి అలంకరించిన అమిత్ షా సాక్షాత్తు పార్లమెంట్లో అంబేద్కర్ ను అవమానపరిచి న అమిత్ షా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి వస్తున్న సందర్భంగా వామపక్ష పార్టీలు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అమిత్ షా రాకకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం జరిగింది .అందులో భాగంగానే చిత్తూరు జిల్లా కేంద్రమైన చిత్తూరు దర్గా సర్కిల్ లోనే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో అమిత్ షా గో బ్యాక్ రాజ్యాంగాన్ని అవహేళన చేసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను అవమానపరిచిన అమిత్ షా గో బ్యాక్,గో బ్యాక్ నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, పార్టీ సీనియర్ నాయకులు కే.మణి,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి చంద్ర, కె.రమాదేవి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఏ.కవిత, ఆరుముగం, మునస్వామి ఏ. గుర్రప్ప పాల్గొన్నారు.